యునైటెడ్ ఫ్రంట్: ఆగ్రహించిన సూర్జిత్ | రూ. 5.00 | బీహార్: సత్తా చూపుతున్న రబ్రీ దేవి

12 ఆగస్టు, 1997

# ఇండియా టుడే



గోదావరి గిరిజనులు

## కబ్జాదారులపై కదనం

ఎన్నో దశాబ్దాలుగా మోసాలు, దౌర్జన్యాలతో గిరిజనేతర రైతులు తమ భూములను కబ్జా చేశారని ఆగ్రహించిన పశ్చిమ గోదావరి జిల్లా గిరిజనులు విల్లంబులు చేపట్టారు. భూ వివాదాల పరిష్కారానికి హైకోర్టు తక్షణ చర్యలు సూచించింది

■ గోదావరి గిరిజనులు

# కబ్జాదారులతో హోరాహోరీ పోరాటం


ఫోటోలు: శిప్రా దాస్

**గిరిజనేతర రైతులు కబ్జా చేసిన భూములను తిరిగి సాధించుకోవడానికి పశ్చిమ గోదావరి జిల్లా కోయలు పోరాటం సాగిస్తున్నారు. ఈ సంక్షోభం హైకోర్టు దృష్టికి కూడా వెళ్ళింది. ప్రభుత్వం అరకొర చర్యలతో సరిపెడుతోంది**

అమరనాథ్ కె. మీనన్

ఆంధ్ర ప్రదేశ్‌లోని కోయ తెగవారిలో ఒక చిత్రమైన నమ్మకం ఉంది. విల్లు చేతపట్టి, ఒకే బాణంతో కోడిగుడ్డును పగులకొట్టగలిగితే పొలంలో పంట పుష్కలంగా పండి, ఆ ఏడాది అంతా కుటుంబం సౌభాగ్యవంతమైన జీవితం గడపగలుగుతుందని కోయల విశ్వాసం. కానీ, ఈ ఏడాది వర్ష రుతువు ప్రవేశించి ఎన్నో వారాలు గడచిపోయినా, కోడి గుడ్డును బాణంతో పగులకొట్టి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి పశ్చిమ గోదావరి జిల్లా మెట్ట ప్రాంత కోయలలో ఎవరూ ముందుకు రావడం లేదు. దీనికి బదులు దశాబ్దాల నాటి భూ వివాదాల పరిష్కారం కోసం విల్లంబులు ధరించి గిరిజనేతరులతో పోరాటానికి కోయలు నడుం బిగించారు.

గత ఏడాది కాలంలో గిరిజన, గిరిజనేతరుల మధ్య దాడులు, ప్రతీకార దాడులు సర్వసాధారణమైనాయి. మొదట్లో భూముల స్వాధీనం వ్యవహారం నిరాహార దీక్షలకే పరిమితమైంది. 1995 మే నెలలో జీలుగుమిల్లి మండలం జిల్లెలగూడెంలోని కోయలు తమ భూములను నకిలీ పట్టాల సాయంతో గిరిజనేతరులు కబ్జా చేశారని గ్రహించారు. కోయల డిమాండ్‌ను పురస్కరించుకుని ప్రభుత్వం గిరిజనేతరుల నుంచి 29 ఎకరాలను స్వాధీనం చేసుకుని, కోయలకు పంచడానికి ఉత్తర్వులు జారీ చేసింది. తర్వాత మనుగోపాల, కోయనాగం పాలెం గ్రామాలలో కూడా కోయలు కబ్జా సమస్యను లేవనెత్తి, గిరిజనేతరులను తమ భూముల నుంచి ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. రాచనగూడెం, రెడ్డినాగం పాలెంలలో గిరిజనేతరుల భూములను కోయలు తమ అధీనంలోకి తెచు గారు. దీంతో గిరిజనేతరు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణలను నివారించడానికి 1995 జూలైలో గిరిజన అనుకూల సంస్థ 'శక్తి', గిరిజనేతరులు కలిసి ఏజన్సీ రైతు సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంఘం ఒక త్రిసూత్ర ఒప్పందాన్ని కుదుర్చుకొంది. దీని ప్రకారం భూ సంబంధ రికార్డులను గ్రామాలలో బహిర్గతం చేయాలి; గిరిజనులకు భూ పంపిణీ చేయడానికి సంబంధించిన ఉత్తర్వులను తక్షణం అమలు చేయాలి; సక్రమమైన పట్టాలు, ఉత్తర్వులు కలిగి ఉన్న గిరిజనేతరుల భూములను గిరిజనులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించకూడదు. ఈ ఒప్పందం భారతదేశంలో ప్రప్రథమమని చెప్పాలి. దీనికింద జరిగిన పరిశీలనలో గిరిజనేతరులు అక్రమంగా ఆక్రమించిన భూములు చాలానే ఉన్నాయని తేలింది. కానీ, వాటిని గిరిజనులకు పంపిణీ చేయడానికి గిరిజనేతరులు ముందుకు రాలేదు. నమ్మకద్రోహానికి గురయ్యామని కోయల్లో ఆగ్రహం పెల్లుబికింది. ఉద్రిక్తతలు పెరిగాయి.

1996 ఏప్రిల్‌లో మనుగోపాలలో గిరిజనేతర రైతులు కోయలపై దాడులు చేశారు. దానికి ప్రతీకారంగా గిరిజనులు జీలుగుమిల్లి, పోలవరం మండలాలలో పంటలను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు 18 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి కూడా ఎలాంటి నివారణ చర్యలు తీసుకోకపోవడంతో పరిస్థితి క్రమేణా అదుపు తప్పింది.

తమ పంటలను గిరిజనులు అపహరించుకుపోవడంతో ఆగ్రహించిన రైతులు, గిరిజనుల పైనా, ఎం.ఆర్.ఓ ఆఫీసు పైనా దాడులు చేశారు. బంద్ కూడా నిర్వహించారు. గిరిజనేతరుల క్లెయిములను పరిశీలించడానికి ప్రభుత్వం ఓ సెటిల్‌మెంట్ అధికారిని నియమించింది. గిరిజనుల వాదాన్ని వినిపించడానికి 'శక్తి' సంస్థకు అనుమతి నిరాకరించింది. దాంతో 'శక్తి' హైకోర్టుకు అర్జీ పెట్టుకుంది. గిరిజనుల వాదాన్ని వినిపించడానికి అనుమతి సాధించింది. అయినా, సంక్షోభం తొలగలేదు. 1997 ఫిబ్రవరిలో జీలుగుమిల్లి మండలంలోని పి. రాజవరం గ్రామంలో భూ రికార్డుల తనిఖీని గిరిజనేతరులు అడ్డుకున్నారు. ఈ సర్వేలో భాగస్వామ్యాన్ని కోరుతూ గిరిజనులు అరెస్టయ్యారు. రెండు వర్గాల మధ్య ఘర్షణలు పెరిగాయి.

**గిరిజనుల అధీనంలో కేవలం 13,358 హెక్టార్ల భూమి ఉండగా, గిరిజనేతరులు 28,367 హెక్టార్లను సాగు చేయడం చూస్తే పరిస్థితి అర్థమవుతుంది. గిరిజనులు భూములతో పాటు తమ సంఖ్యాధిక్యతనూ కోల్పోయారు.**

1997 మే నెలలో 'శక్తి' నాయకులు పి. శివరామకృష్ణ, శారదలను ప్రభుత్వం అరెస్ట్ చేసినందుకు ప్రతిగా, కోయలు జీలుగుమిల్లి మండల రెవిన్యూ అధికారిని కిడ్నాప్ చేశారు.

1997 జూన్‌లో పోలీసు కస్టడీలో ఉన్న కొందరు గిరిజనుల విడుదలను డిమాండ్ చేస్తూ కోయలు అంకన్నగూడెంలో మామిడి తోటపై దాడి చేసి, ఓ గిరిజనేతర రైతునూ, ఫారెస్ట్ గార్డ్‌నూ కిడ్నాప్ చేశారు. ఈ విధంగా సంఘర్షణ తీవ్రరూపం ధరించింది. పి. రాజవరం గ్రామంలో గిరిజనేతర రైతు సింహాద్రి గోపాలరావు ఛాతీలో బాణం దూసుకుపోయి హతుడైనప్పటినుంచి పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. గిరిజనుల దాడులవల్ల భీతావహులైన గిరిజనేతర రైతులు పొలాలను సాగు చేయడం నిలిపివేశారు. గిరిజనులు విల్లంబులు ధరించకుండా నిషేధం విధించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ''ప్రభుత్వం మా సమస్యలను పట్టించుకోవడం లేదు. గ్రామాలలో శాంతియుత వాతావరణాన్ని కాపాడి, సేద్యం పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడం లేదు'' అని గిరిజనేతర రైతు కె. నాగేశ్వరరావు అన్నారు. ఆయన



**దశాబ్దాలనాటి భూ వివాదాల పరిష్కారానికి విల్లంబులు చేపట్టిన గిరిజనులు**

కుటుంబానికి చెందిన 168 ఎకరాలలో గిరిజనుల భయం వల్ల వరుసగా రెండేళ్ళ నుంచి పంటలు వేయడం లేదు. "పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. ఇక్కడి భూ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే మరిన్ని ఘర్షణలు జరిగే ప్రమాదం ఉంది" అని జాతీయ షెడ్యూల్డ్ కులాలు, తెగల సంఘం మాజీ కమిషనర్ డాక్టర్ బి.డి. శర్మ హెచ్చరించారు.

గిరిజన సమస్యపై పాలక తెలుగుదేశం పార్టీ అనుసరిస్తున్న వైఖరిని రాష్ట్ర హైకోర్టు తీవ్రంగా పరిగణిస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఏర్పడిన సంఘర్షణ వాతావరణాన్ని ఉపశమింపజేయడానికి హైకోర్టు డివిజన్ బెంచ్ కొన్ని ముఖ్యమైన చర్యలు సూచించింది. ఈ డివిజన్ బెంచ్‌లో ప్రధాన న్యాయ మూర్తి ప్రభాశంకర్ మిశ్రా, జస్టిస్ పి.రామకృష్ణం రాజు సభ్యులు. గిరిజన-గిరిజనేతర సంక్షోభం పరిష్కారానికి హైకోర్టు కింది చర్యలను సూచించింది.

*వ్యాజ్యాలలో చిక్కుకోని భూములను రెండు నెలల్లోగా గిరిజనులకు అప్పగించాలి;

*స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా కలెక్టర్లు, సంబంధిత ఇతర అధికారుల వద్ద పెండింగులో ఉన్న భూ వివాదాలను ఒక నిర్దిష్ట కాలపరిమితి లోపల పరిష్కరించాలి;


*హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను స్పెషల్ బెంచ్‌కి బదలీ చేయాలి;

*గిరిజనులను నిందితులుగా నమోదు చేసిన కేసు లన్నింటినీ సమీక్షించాలి;

*చిల్లర నేరాల కేసుల్లో చిక్కుకున్న నిర్బంధానికి గురైన గిరిజనులపై కేసులు ఎత్తివేయాలి;

*గ్రామాలకు వలంటీర్లను పంపి గిరిజనులలో నమ్మకం పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలి.

కోయల ప్రయోజనాల పరిరక్షణలో చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాన్ని హైకోర్టు ఉత్తర్వులు దాదాపు అభిశంసించాయని అనుకోవచ్చు. రాజకీయ వాదులు-అధికారులు-గిరిజనేతర రైతుల కూటమి బలపడడానికి ప్రభుత్వం దోహదం చేసిందన్న అభిప్రాయం సహేతుకమేననుకోవడానికి కోర్టు ఉత్తర్వులు ఆధారమిస్తున్నాయి. గిరిజనేతరుల ప్రయోజనాలను కాపాడతామని తెలుగుదేశం పార్టీ నాయకులు వాగ్దానం చేసినా దాన్ని నిలబెట్టు కోవడంలో విఫలమయ్యారు. ఫలితంగా వ్యవసాయ మంత్రి కె. విద్యాధరరావుకూ, పార్టీలోని ప్రత్యర్థి లాబీకి మధ్య సంఘర్షణ ఏర్పడింది. సి.పి.ఐ (ఎం) మినహా తక్కిన పార్టీలు కూడా గిరిజనేతరుల పట్లనే సానుభూతి ప్రదర్శిస్తున్నాయి. అందువల్ల సమస్య పరిష్కారంలో ఆ పార్టీలు ప్రయోజనకరమైన పాత్ర




# అర్థవంతమైన ఆట పాటలు

కోయలు వైకుంఠపాళి ఆట ద్వారా భూములకు సంబంధించిన చట్టాలు, నియమనిబంధనల గురించి చైతన్యవంతులవుతున్నారు. ప్రామాణిక చట్టాల గురించి, సంబంధిత కాగితాల కోసం అధికార యంత్రాంగాన్ని కదిలించడం గురించి, గిరిజనేతరుల వ్యూహాల గురించి 48 చదరాల ఆ వైకుంఠపాళీలో ఇమిడ్చారు.

"కేవలం అక్షరజ్ఞానం మాత్రమే ఉన్న వ్యక్తి కూడా ఈ రోజున తన హక్కుల గురించి మాట్లాడుతున్నాడంటే దీని ప్రభావం ఎంతగా ఉందో అర్థమవుతోంది" అని కోయవాళ్ళకు అనుకూలంగా ఉద్యమం నడుపుతున్న 'శక్తి' సారథి పి. శివరామకృష్ణ అన్నారు. కోయవారిలో అక్షరాస్యులు కేవలం ఏడు శాతం మంది మాత్రమే అని గుర్తించిన శివరామకృష్ణ ఈ సరికొత్త వైకుంఠపాళీ ఆటను రూపొందించారు. గిరిజన జానపద సాహిత్యం, సంగీతాలపై పిహెచ్.డి చేస్తున్నప్పుడు ఆయనకు ఈ ఆలోచన వచ్చింది. ఆయన పుణ్యమాని తొక్కుడుబిళ్ళ ఆట కూడా కోయ యువతీయువకులలో ప్రాచుర్యం పొందింది. ఈ ఆటలో నేలపై గీసిన చదరాలు వివిధ రకాల భూములనూ, వాటిలో పండే పంటలనూ, వచ్చే ఆదాయాన్నీ సూచిస్తాయి.

ఇప్పుడు గిరిజనులు తమంతటతామే తమ తమ గ్రామాలలో సర్వే జరిపి భూముల సొంతదారుల గురించి, ఆ భూములను ఉపయోగించుకుంటున్న వారి గురించి వివరాలను సేకరించి వాటిని ప్రభుత్వ రికార్డులతో సరిచూస్తున్నారు.

— అమరనాథ్ కె. మీనన్

వహించలేకపోతున్నాయి. ఇక పశ్చిమ గోదావరి జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో నిషిద్ధ పీపుల్స్ వార్ గ్రూపునకు ప్రాబల్యం లేకపోవడం వల్ల అదృష్టవశాత్తూ సమస్య ఉగ్రరూపం ధరించలేదు. ఇప్పటికి ఎన్నో ఏళ్ళుగా పశ్చిమ గోదావరి జిల్లా డెల్టా రైతులు మెట్ట ప్రాంతాలకు వలస వచ్చి సారవంతమైన గిరిజన భూములను వివిధ పద్ధతుల్లో స్వాధీనం చేసుకొని పొగాకు, జీడిమామిడి, మామిడి పంటలు సాగుచేస్తున్నారు. కొన్ని గిరిజన భూములను న్యాయంగానే కొనుగోలు చేసి ఉండవచ్చుకానీ, అనేక సందర్భాల్లో అమాయక గిరిజనులను మోసపుచ్చో, దౌర్జన్యం చేసో వారి భూములను కబ్జా చేయడం జరిగింది. ఇదే నేటి సంఘర్షణకు బీజం వేసింది. కల్లోలిత జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం మండలాలలో గిరిజనుల అధీనంలో 13,358 హెక్టార్ల భూమి ఉండగా, గిరిజనేతరులు 28,367 హెక్టార్లను సాగుచేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ భూములతో పాటు తమ సంఖ్యాధిక్యాన్ని కూడా గిరిజనులు కోల్పోయారు. 1971లో జనాభాలో గిరిజనుల శాతం 55.1 కాగా, 1991లో అది 39.31 శాతానికి తగ్గిపోయింది.

కోయల హక్కులను కాపాడడానికి పేరుకు కొన్ని చట్టాలున్నా వలసదారుల నుంచి వారి ప్రయోజనాలను రక్షించడానికి అధికారులు శ్రద్ధ చూపలేదు. అధికార యంత్రాంగ నిర్లక్ష్యం, క్రియాశూన్యత మూలంగా కోయలు తమ భూములను కోల్పోయారు. ఉదాహరణకు, కోయనాగంపాలెం గ్రామంలోని 30 కోయ కుటుంబాలలో ఎకరం, రెండెకరాల భూమి ఉన్న కుటుంబాల సంఖ్య ఆరుకు మించదు. అదే గిరిజనేతరులకైతే సువిశాల క్షేత్రాలు ఉన్నాయి. ఈ గిరిజనేతర రైతులు నివసించేది దూరాన ఉన్న పట్టణాల్లో. కానీ, గిరిజనులలో చైతన్యం పెరగడంతో పరిస్థితులు మారిపోతున్నాయి. ఇంతకుమునుపు అణిగి మణిగి ఉన్న కోయలలో స్వచ్ఛంద సంస్థ 'శక్తి' (సెర్చ్ ఫర్ యాక్షన్ అండ్ నాలెడ్జ్ ఫర్ ట్రైబల్ ఇనిషియేటివ్) గత నాలుగేళ్ళుగా చైతన్య దీప్తి రగిలించింది. కోయలకు వారి హక్కులను తెలియజెప్పి, వ్యక్తిత్వ వికాసానికి కృషి చేసింది. ఫలితంగా కోయలు తమ భూములను తిరిగి పొందడానికి పోరాటం ఆరంభించారు. "భారత రాజ్యాంగం పౌరులందరి ఆదర్శాలను, సిద్ధాంతాలను ప్రతిబింబిస్తోంది. ఈ దేశపు చట్టాలు ప్రజలందరికీ సమంగా న్యాయం చేకూరుస్తాయని గిరిజనులు గ్రహించేటట్లు కృషి చేశాం" అని శక్తి సంస్థ సారథి డాక్టర్ పి. శివరామకృష్ణ చెప్పారు. కోల్పోయిన భూములను తిరిగి పొందడానికి చట్ట ప్రక్రియలపై ఆధారపడాలని శక్తి సంస్థ గిరిజనులకు సూచిస్తోంది.

పశ్చిమ గోదావరి జిల్లాలో భూముల యాజమాన్యాన్ని నాలుగు తరగతులుగా వర్గీకరించవచ్చు. అవి: మదింపు చేసిన బంజరు భూములు, పోరంబోకు భూములు, పట్టా భూములు, 1970 నాటి నిబంధనల ప్రకారం కేటాయించిన భూములు. వీటిలో చివరి తరగతి భూములు షెడ్యూల్డ్ ప్రాంతాలలో ఉన్నాయి. ఈ భూములను గిరిజనుల నుంచి గిరిజనేతరులకు బదలీ చేయరాదని 1970 నాటి నిబంధనలు స్పష్టంగా నిర్దేశిస్తున్నాయి. భూ సంబంధ రికార్డులలోని

గిరిజన మహిళా కార్యకర్త టి. కృష్ణవేణి



"మాకు రావలసిన భూముల కోసం, వివిధ ప్రభుత్వ పథకాల కింద మాకు లభించవలసిన సౌకర్యాల కోసం డిమాండ్ చేస్తున్నందుకే వేధింపులకు గురిచేస్తున్నారు."





ఎమ్మార్వో కార్యాలయంలో ధ్వంసమైన భూ రికార్డులు (ఎడమ); గిరిజనులతో కొరటాల సత్యనారాయణ

జటిలమైన అధికార పరిభాషను అర్థం చేసుకుని, అధికారులను సవాల్ చేసి, తమ క్లెయిములను సాధించుకోవడం గురించి గిరిజన వలంటీర్లకు శక్తి సంస్థ శిక్షణ ఇచ్చింది.

గిరిజనేతర రైతులపరమైన గిరిజన భూములను తిరిగి గిరిజనులకు అప్పగించడానికి జరిగిన ప్రయత్నాలు కోర్టు పోరాటాల్లో దిగబడిపోయాయి. తమను ఖాళీ చేయించడానికి జరిగిన ప్రయత్నాలను గిరిజనేతర లాబీ గట్టిగా అడ్డుకొంటోంది. మెట్టు గూడెంలో ఒక గిరిజనేతర రైతు అధీనంలో ఉన్న తన అయిదెకరాల భూమిని తిరిగి పొందడానికి గాలి కనకయ్య 1977 నుంచి నిరీక్షిస్తూనే ఉన్నాడు. ఈ కేసు ఇప్పటికీ ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. కోయ తెగకు చెందిన మేడకం సూరమ్మ పరిస్థితి కూడా ఇంతే. గంగవరం గ్రామంలో 20 ఎకరాల భూమిపై ఆమె క్లెయిము ఇప్పటికీ అపరిష్కృతంగా మిగిలింది. పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 37,36.678 ఎకరాలకు సంబంధించిన 548 కేసులు హైకోర్టులోనూ, జిల్లా కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వద్దనూ పెండింగ్‌లో ఉన్నాయి. తమ తమ క్లెయిముల సంగతి గ్రామసభల్లో తేల్చుకోవడానికి సంబంధిత పత్రాలను సమర్పించాలని గిరిజనులు డిమాండ్ చేయగా, అందుకు సిద్ధంగా లేని గిరిజనేతరులు జీలుగుమిల్లి మండల రెవిన్యూ ఆఫీసులోని భూ రికార్డులకు నిప్పంటించారు. పైగా, గిరిజనేతరుల అధీనంలో 6,180 ఎకరాల ప్రభుత్వ భూములు ఉండగా, గిరిజనుల వద్ద కేవలం 1,052 ఎకరాలు ఉన్నాయి. గిరిజనేతర లాబీకి రాజకీయవాదుల అండదండలు ఉన్నాయి. వారు పోలీసులతో కోయలపై దాడులు చేయించి, పైచేయి సాధించే యత్నాలు సాగిస్తున్నారు. చివరకు గిరిజన స్త్రీలను కూడా పోలీసులు చితకబాదిన సందర్భాలు ఉన్నాయి.

గిరిజనేతర భూములపై కోయలు దాడులు చేసి, పంటలను నాశనం చేయడం, అపహరించడం వంటి చర్యలకు పాల్పడడంతో పోలీసుదాడులు ముమ్మరమయ్యాయి. అదే సమయంలో కోయలపై తప్పుడు కేసులు బనాయించిన సందర్భాలూ ఉన్నాయి.

అందుకే పశ్చిమ గోదావరి జిల్లాలో గిరిజనులపై పోలీసులు పెట్టిన కేసులన్నింటినీ సమీక్షించి, తప్పుడు కేసులలో అరెస్టు చేసిన గిరిజనులను విడుదల చేయాలని రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.

''న్యాయంగా మాకు చెందవలసిన భూముల కోసం, వివిధ ప్రభుత్వ పథకాల కింద మాకు అందవలసిన సౌకర్యాల కోసం డిమాండ్ చేస్తున్నందుకే వేధింపులకు గురి చేస్తున్నారు'' అని గిరిజన

## జిల్లాలవారీగా షెడ్యూల్డ్ ప్రాంతాలు

| జిల్లా | మొత్తం ప్రాంతం (చ.కి.మీలలో) | షెడ్యూల్డ్ ప్రాంతాలు (చ.కి.మీలలో) | షెడ్యూల్డ్ ప్రాంతం % | షెడ్యూల్డ్ ప్రాంతాలు ఉన్న మండలాలు | షెడ్యూల్డ్ గ్రామాలు |
|---|---|---|---|---|---|
| శ్రీకాకుళం | 5837 | 518.31 | 8.88 | 1 | 108 |
| విజయనగరం | 6539 | 800.00 | 12.23 | 8 | 298 |
| విశాఖపట్నం | 11161 | 6749.54 | 60.47 | 12 | 3368 |
| తూర్పు గోదావరి | 10807 | 6715.48 | 62.14 | 7 | 559 |
| పశ్చిమ గోదావరి | 7742 | 1510.05 | 19.50 | 3 | 102 |
| ఖమ్మం | 16029 | 6725.43 | 41.96 | 32 | 889 |
| వరంగల్ | 12846 | 992.25 | 7.72 | 11 | 177 |
| ఆదిలాబాద్ | 16128 | 4587.48 | 28.44 | 32 | 412 |
| మహబూబ్‌నగర్ | 18432 | 1432.22 | 7.77 | 4 | 25 |
| మొత్తం | 105521 | 30030.76 | 28.46 | 110 | 5938 |

మహిళా కార్యకర్త టి. కృష్ణవేణి చెప్పారు. పాత చిమల వారిగూడెంలో ప్రభుత్వ అక్షరాస్యతా పథకాన్ని, పొదుపు లక్ష్మి పథకాన్ని కృష్ణవేణి నిర్వహిస్తున్నారు. మహిళల పొదుపు మొత్తాలను డిపాజిట్ చేయడానికి ఆమె అయిదు కిలోమీటర్ల దూరంలోని బ్యాంకుకు వెళ్ళవలసి ఉంది. కానీ, పోలీసులు తనను కిడ్నాప్ చేసి, మానభంగం చేస్తామని బెదరించడం వల్ల గత మూడు నెలల నుంచి ఆమె బ్యాంకుకు వెళ్ళ లేకపోతున్నారు. కాగా, డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్ జె. బ్రహ్మారెడ్డి పోలీసులపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తున్నారు. ''నేను ఆత్మాభిమానిని. అందువల్ల అంతా నన్ను అపార్థం చేసుకుంటున్నారు'' అని ఆయన చెప్పారు. ఆయనను బదలీ చేయాలని కోయలు డిమాండ్ చేశారు. ఆ తర్వాత తీరిగ్గా రెండు నెలలకు ప్రభుత్వం బ్రహ్మారెడ్డిని బదలీ చేసింది.

స్థానిక అధికార యంత్రాంగంలో గిరిజనులకు విశ్వాసం నశించింది'' అని జాతీయ షెడ్యూల్డ్ కులాలు, తెగల మాజీ కమిషనర్ డాక్టర్ బి.డి. శర్మ హెచ్చరించారు. గిరిజన ప్రాంతాలలో పర్యటించి వచ్చిన శర్మ, ''భూ సమస్యను అక్కడికక్కడ పరిష్కరించి, స్పష్టమైన చర్యలు తీసుకునే అధికారంతో ఓ స్వతంత్ర సంస్థను నియమించడం అవసరం'' అని అన్నారు.



అన్యాయంపై ఆగ్రహించిన కోయ యువతరం

పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉద్రిక్త పరిస్థితులు అదుపు తప్పి, గిరిజనులు పెద్ద సంఖ్యలో ఉన్న ఇతర జిల్లాలకు కూడా పాకవచ్చుననే భయం రాష్ట్ర ప్రభుత్వానికి పట్టుకొంది. అందుకనే ఈ ఏడాది చివరలోగా పశ్చిమ గోదావరి జిల్లాలోని 101 గ్రామాలలో భూ రికార్డులను బహిరంగంగా తనిఖీ చేసి, వివాదాలను పరిష్కరించి, ఆక్రమణ దారులను వెళ్ళగొట్టడానికి ఉత్తర్వులు జారీచేసింది. కల్లోల గ్రామాలను సందర్శించి పరిస్థితులను ప్రత్యక్షంగా ఆకళింపు చేసుకోవడానికి ముగ్గురు మంత్రుల కమిటీని నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ వర్షాకాల సమావేశాలలో ప్రకటించింది. ఈ క్యాబినెట్ కమిటీలో రెవిన్యూ మంత్రి టి. దేవేందర్ గౌడ్, ఉన్నత విద్యా మంత్రి జి.ఎం.సి. బాలయోగి, గిరిజన సంక్షేమ మంత్రి జి. నాగేష్‌లు సభ్యులుగా ఉంటారు. "ఇదో సంక్లిష్టమైన, సున్నితమైన, జటిలమైన సమస్య. ఉద్రేకాలకు తావు ఇవ్వకుండా పరిష్కారానికి కృషి చేయడం అవసరం'' అని దేవేందర్ గౌడ్ అన్నారు.


భూములకు సంబంధించిన వాస్తవ వివరాలనూ, రికార్డులనూ గ్రామ సభలకు సమర్పించి, సందేహాస్పద పత్రాలను రద్దు చేసి, తమ భూములను తిరిగి అప్పగించాలని కోయలు డిమాండ్ చేస్తున్నారు. 20వ శతాబ్దపు తొలి సంవత్సరాల రికార్డుల ఆధారంగా తమ క్లెయిములను పరిష్కరించాలని, గిరిజన భూములు గిరిజనేతరులకు బదలీ కాకుండా నిరోధించడానికి ఓ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కూడా కోయలు కోరుతున్నారు. గిరిజ నేతరులకు లీజుపై ఇచ్చిన భూములను తిరిగి తమకు అప్పగించాలని కోరుతున్నారు.

వివిధ చట్టాలను పరిశీలిస్తే గిరిజనుల ప్రయోజనాలను అసలెన్నడూ పూర్తిగా పరిరక్షించలేదని తేలుతుంది. 1917 నాటి ఏజన్సీ భూములు, భూ బదలీ చట్టం ప్రకారం ఒక గిరిజనుడి నుంచి గిరిజ నేతరునికి భూమి బదలాయింపు చెల్లదు. అయితే, దానికి ఒక మినహాయింపు ఉంది. జిల్లా కలెక్టర్ లిఖిత అనుమతితో ఈ బదలాయింపు జరపవచ్చు. చట్టంలోని ఈ లొసుగును ఉపయోగించుకుని యథేచ్ఛగా భూముల అన్యాక్రాంతం జరిగిపోయి, పరిస్థితి ఈ కాడికి వచ్చింది. 1959 షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలీ నియంత్రణ చట్టంలో ఈ లొసుగును సరిదిద్దారు. గిరిజనుల నుంచి గిరిజనేతరులకు భూ బదలాయింపు ఏ పరిస్థితిలోనూ చెల్లదని ఆ చట్టం నిర్దేశించింది. 1970లో చట్టానికి మరిన్ని మార్పులు చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతాలలో గిరిజనేతరుల మధ్య కూడా భూముల మార్పిడీ జరగరాదని నిర్దేశించారు. భూ వ్యవహారాల సమీక్షకు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (గిరిజన సంక్షేమం)ను నియమించి, గిరిజనేతరులను గిరిజన భూముల నుంచి ఖాళీ చేయించడానికి ప్రభుత్వం ప్రయత్నించినా, గిరిజనేతరులు 'స్టే'లు తెచ్చుకుని ఆ యత్నానికి గండి కొట్టారు.

తాను సాగుచేస్తున్న భూమికి వాస్తవ యజమాని తానేనని చట్టప్రకారం నిరూపించుకోవలసిన బాధ్యత గిరిజనేతరునిదే కానీ, గిరిజనేతరులు తమ యాజమాన్య హక్కులను నిరూపించుకోవడానికి ఆధారంగా చూపే పత్రాలు చాలా సందర్భాల్లో అనుమానాస్పదం. ''పశ్చిమ గోదావరి జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లోని షెడ్యూల్డ్ ప్రాంతాల్లోనూ భూములు కలిగిఉన్న గిరిజనేతరుల వద్ద దండిగా బోగస్ పత్రాలు ఉన్నాయి'' అని ఉస్మానియా విశ్వవిద్యాలయ సోషల్ ఆంత్రోపాలజీ విభాగానికి చెందిన డాక్టర్ జయప్రకాశ్ రావు చెప్పారు. ''అక్రమ పద్ధతుల్లో భూములు సంపాదించిన వారి సంఖ్య చాలా ఎక్కువగానే ఉండడం వల్ల ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలంటే తాజాగా సర్వే జరిపించి, పకడ్బందీగా వివరాలను నమోదు చేయించడం అవసరం'' అని ఆయన అన్నారు. నక్సలైట్ గ్రూపులు పశ్చిమగోదావరి జిల్లాలోని గిరిజనుల్లో నెలకొని ఉన్న అసంతృప్తిని ఉపయోగించుకొని హింసా కాండను రెచ్చగొట్టకుండా నివారించాలంటే భూములపై సమగ్ర సర్వే జరిపించడం అవశ్యకమని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కూడా అంగీకరిస్తున్నారు. నక్సలైట్లు పశ్చిమ గోదావరి జిల్లాలో వేళ్ళూనకుండా నిరోధించాలంటే ఇలాంటి సర్వే అవసరమని వారు సూచిస్తున్నారు. కాగా, తమకు జరుగుతున్న అన్యాయం, దోపిడీలను గుర్తెరిగిన గిరిజనులకు పగ్గాలు వేయడం ఎంతో కాలం సాధ్యపడదు'' అని శివరామకృష్ణ అన్నారు. ఇదిలా ఉండగా, పొరుగు జిల్లా ఖమ్మంలో పొగాకు సాగుకు గిరిజనుల నుంచి భూములను లీజుకు తీసుకో వద్దని గిరిజనేతరులను అధికారులు హెచ్చరించడం ఇక్కడ గమనార్హం. గిరిజనులు హెచ్చుగా నివసించే ఎనిమిది జిల్లాల్లో భూ వివాదాలు పెచ్చరిల్లే ప్రమాదం ఎంతైనా ఉంది. వివిధ జిల్లాల్లో వ్యాపించి ఉన్న కోయలు తదితర గిరి జనులు ఇంకా చేతులు కలిపి ఉద్య మించడం లేదు. కానీ, కోయ తెగకు చెందిన ఎం. రంగారావు చెప్పినట్లు, ''కోయ యువజనులు తమకు జరిగిన మోసాలను గ్రహించి అంతకంతకూ పోరు పంథాను అనుసరిస్తున్నారు.'' ఈ పరిస్థితుల్లో గిరిజన భూ సమస్య తక్షణ పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం మేల్కొనడం మంచిది. ■



''నేను ఆత్మాభిమానిని. అందువల్ల అందరూ నన్ను అపార్థం చేసుకుంటున్నారు.''
- జె. బ్రహ్మారెడ్డి
డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్



''ప్రభుత్వం మా సమస్యలను పట్టించుకోవడం లేదు. సేద్యం పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడంలేదు.''
కె. నాగేశ్వరరావు
గిరిజనేతర రైతు